## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు



మెయిన్‌లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 20 జూన్, 2026 | పేజీలు :08

# ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను అధునాతనంగా తీర్చిదిద్దాలి

### పోటీ పరీక్షల అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎస్సీ స్టడీ సర్కిల్ లో అన్ని సౌకర్యాలు కల్పించి అధునాతనంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ను సందర్శించారు. గదులు కలియ తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. ప్రస్తుత వసతుల గురించి గురించి సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వారు చదువుకునేలా రీడింగ్ రూమ్ సిద్ధం చేయాలన్నారు. తాగునీరు మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న వస్తువులను ఖాళీ చేయించాలని.. వారంలోగా భవనానికి అవసరమైన మరమ్మత్తులు చేయించాలని టీజీ డబ్ల్యూఐడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ పరీక్ష నిర్వహించేలా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఉద్యోగులు ఉన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి**

లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా .. గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 25వ డివిజన్ పరిధి సుభాష్ నగర్ ఏరియా బుట్టి రాజారాం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్.. డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లాలో బిల్లులు జమ కాని

తరువాయి 3లో



## విద్యార్థులకు మత్తు పదార్థాలు
# అమ్మితే కఠిన చర్యలు



### విద్యాసంస్థలకు 100 మీటర్ల లోపు ధూమపానం, మద్యపానాలు నిషేధం: ఎసిపి మాధవి

**ప్రజాపక్షం/హుజురాబాద్ :** కరీంనగర్ సిపి గౌస్ అలం ఆదేశాల మేరకు శుక్రవారం హుజురాబాద్‌లోని విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న పలు పాన్‌షాపులు, కిరాణం షాపులను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసిపి మాధవి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు విద్యార్థులకు మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ ఏసిపి మాధవి హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ తనిఖీల్లో హుజురాబాద్ పట్టణ సిఐ కరుణాకర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పానీపూరి సెంటర్లు, హోటళ్లలో
# ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని పానీపూరి సెంటర్‌లు, హోటళ్లలో శుక్రవారం మండల పరిషత్ అధికారి బీరయ్య గ్రామ కార్యదర్శితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారు చేసేందుకు ఉపయోగించే సరుకులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కుళ్లి పోయిన, రసాయనాలతో కూడిన పదార్థాలు వాడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ హెచ్చరించారు.



## బాధితులను కుటుంబ సభ్యులుగా
# భావించి సేవలందించాలి:డిసిపి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, వార్షిక తనిఖీలలో భాగంగా పెద్దపల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం డీసీపీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు, ఫిర్యాదుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ఆత్మీయత కలిగేలా, కుటుంబ సభ్యులుగా భావించి మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు.అనంతరం రిసెప్షన్ రికార్డులతో పాటు ఇతర స్టేషన్ రికార్డులను పరిశీలించి,వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళలకు సంబంధించిన కేసుల వివరాలను తెలుసుకుని,వాటి దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. మహిళా బాధితులకు న్యాయం జరిగేలా కేసుల విచారణను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను ఓపికగా విని,ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు.మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయ్యే కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులు,కౌన్సెలింగ్‌కు వచ్చే కేసులలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లయితే, విడిపోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు.సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని, చిన్న చిన్న సమస్యలకే తొందరపడి విడిపోవద్దని,కోర్టుల చుట్టూ తిరుగుతూ అన్ని విధాలా నష్టపోతున్న విషయాన్ని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుందని, కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ తనిఖీలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు,మహిళా ఎస్ఐ రాజమణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



### టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ...

# నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన

### జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, 10వ తరగతి, ఇంటర్మీడియట్ , డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 22, ఉదయం 10:00 గంటలకు టాస్క్ ప్రాంతీయ కేంద్రం, పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ బస్ డిపో ప్రాంగణం పక్కన హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9154909057, 9959892960 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జగిత్యాలలో అరుదైన శస్త్ర చికిత్స

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అరుదైన చికిత్స ను శుక్రవారం వైద్యులు విజయవంతంగా నిర్వహించారు.ధర్మపురి పట్టణానికి చెందిన ఓ మహిళ తీవ్ర కడుపునొప్పితో ఆసుపత్రిలో చికిత్స కోసం అడ్మిట్ కాగా అన్ని పరీక్షలు చేసి కడుపులో ఏడు కిలోలకు పైగా కణతి ఉందని నిర్ధారించిన డాక్టర్లు డాక్టర్ శ్రీకాంత్ సర్జన్, డాక్టర్ నాగరాణి,స్త్రీల వైద్య నిపుణులు విజయవంతంగా కణతిని తొలగించి శస్త్ర చికిత్స నిర్వహించారు.ఇలాంటి వి చాలా అరుదుగా ఇంత పెద్ద పరిమాణంలో కణతిలు ఉంటాయని పేర్కొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడీ బాట

**ప్రజాపక్షం/కొడిమ్యాల :** జగిత్యాల జిల్లా కొడిమియాల మండలంలోని చెప్యాల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సుధారాణి మాట్లాడుతూ 3నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందిస్తారని మరియు నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు.చిన్నారుల శారీరక మానసిక వికాసానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి టీచర్లు ఉమ, అంజలి, జ్యోతి, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉద్యోగుల బదిలీలు సహజమే

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** విధి నిర్వహణలో భాగంగా ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజమేనని ఎంపిడిఒ శ్రీకాంత్, పలు గ్రామాల సర్పంచులు అన్నారు.ఈ సందర్భంగా మండలంలో పనిచేసే బదిలీపై వెళ్లిన ఎంపీఓ జగదీష్,సీనియర్ అసిస్టెంట్ మహేష్, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ, అదేవిధంగా మండలానికి బదిలీపై వచ్చి ఎంపీవోగా బాధ్యత స్వీకరించిన మహేశ్వర్ రెడ్డిని,ఆయా గ్రామాల కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులకు స్వాగతం పలుకుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ ఆహ్వాన కార్యక్రమాన్ని శుక్రవారం జరిపించారు. బదిలీపై వెళ్లిన అధికారులు మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలో పనిచేసిన జ్ఞాపకాలు మర్చిపోలేనివని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బదిలీపై వెళ్లిన బదిలీపై వచ్చిన అధికారులను కార్యదర్శులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్,కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు గోరుమంతుల మురళి,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## రాయికల్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/రాయికల్ :** కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారంరాయికల్ పట్టణంలో గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి మార్గదర్శనం చేయగలిన యువ తేజం రాహుల్ గాంధీ అని ఆయన దెబ్బకు బిజెపి పార్టీ ఇతర పార్టీలతో జట్టు కట్ట వలసి దుస్థితి వచ్చిందని అన్నారు. దేశ స్వతంత్ర అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వాలు రక్షణ రంగంలో భారత్ ను ఒక అజేయశక్తి గా నిలిపాయన్నారు.యువతకు ఉద్యోగాలు కల్పించల్సిన కేంద్ర ప్రభుత్వం యువతను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ సమస్యను గుర్తించడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశంలో సుస్థిరమైన ప్రజా పాలన అందించగల ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని మత చాందస వాదులు మతాల పేరు చెప్పి గెలిచే ప్రయత్నం చేసిన బడుగు బలహీనవర్గాల సంక్షేమం పట్ల ఆలోచన గలిగిన రాహుల్ గాంధీ దేశంలోనే అత్యున్నతమైన నాయకుడిగా పేరుపొందిరని అన్నారు.దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తు మరింత బలంగా,అభివృద్ధి దిశగా సాగాలంటే రాహుల్ గాంధీ వంటి నాయకత్వం అవసరమని అన్నారు.దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే దూరదృష్టి, ప్రజల పట్ల అంకితభావం కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,కోల శ్రీనివాస్,సర్పంచ్ భారతపు రాజేష్, నాయకులు బాపురపు నర్సయ్య,తలారి రాజేష్,పడిగెల రవీందర్,మున్నూ,సామల్ల వేణు,అల్లె పురుషోత్తం,సింగని రమేష్,ఇర్ఫాన్,బొడ్డుల శివ,కాశవేణి రాజేష్,ఆరె శ్రీనివాస్,మన్నెగుండ్ల నర్సయ్య, బోదాసు జలపతి,ప్రసాద్,భూమేష్,ఇద్దయ్య,తదితరులు పాల్గొన్నారు.

## భూధార్ సర్వే, భూభారతి
# దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

### రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని,సాదా బైనామా, రీ–సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని,రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్–కడాస్ట్రల్ గ్రామాల రీ–సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి కలెక్టర్ చిత్రా మిశ్రా క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్సలు

### -సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రోజున పలు శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ కే.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలానికి చెందిన 30 సంవత్సరాల మహిళ గత ఐదు నెలలుగా తీవ్రమైన రక్తస్రావం మరియు కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గర్భాశయం లోపలి భాగంలో గడ్డ ఉన్నట్లు నిర్ధారణ అయింది. వైద్యుల బృందం ఎండోస్కోపిక్ విధానంలో పాలిపెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పాలిప్‌ను తొలగించారు. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన 45 సంవత్సరాల ఒక వ్యక్తి తీవ్రమైన కడుపునొప్పితో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో శస్త్రచికిత్స నిపుణుల బృందం లాపరోస్కోపిక్ కోలెసిస్టెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పిత్తాశయాన్ని తొలగించారు. అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్ సూచనల మేరకు డాక్టర్ శ్రీధర్ స్వయంగా సుమారు 15రోజుల పాటు కష్టపడి ప్రత్యేక చికిత్స అందించి ఆమెను కాపాడారు. ఇట్టి సర్జరీలలో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ అమర సింహా రెడ్డి, లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ రాము జనరల్ సర్జన్ డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్ ఆర్థోపెడిక్ సర్జన్స్; డాక్టర్ అనసూయ, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రవళిక, గైనకాలజిస్ట్ వైద్యులు; డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కృష్ణవేణి మరియు డాక్టర్ భవాని అనేస్తేషియా వైద్యులు. ఈ ఐదు సర్జరీలు చేసిన వైద్య బృందాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## యూరియా యాప్‌లో గ్రామం పేరు తప్పుగా నమోదు
### రైతుల్లో అయోమయం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కేశపూర్ గ్రామానికి చెందిన రైతు లక్కం శ్రీనివాస్ యూరియా బుకింగ్ కోసం యాప్‌లో వివరాలు నమోదు చేస్తుండగా,డబ్బా గ్రామంలో ఉన్న హనుమాన్ ఫెర్టిలైజర్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపు కేశపూర్ గ్రామ అడ్రస్ పేరుతో కనిపించడంతో గ్రామంలో అసలు ఫర్టిలైజర్ షాప్ లేదని యాప్ లో ఇలా కనిపించడం ఏంటని రైతుల్లోగందరగోళం నెలకొంది. దీనిపై మండల వ్యవసాయ అధికారి రాజు కుమార్‌ను ఫోన్ ద్వారా ప్రజా పక్షం వివరణ కోరగా షాపు డబ్బా గ్రామంలోనే ఉన్నదని, సాంకేతిక కారణాలతో గ్రామం పేరు తప్పుగా నమోదైందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న యూరియా స్టాక్ పూర్తయిన తర్వాత యాప్‌లో గ్రామం పేరు ఆటోమేటిక్‌గా డబ్బాగా మారుతుందని ఆయన వివరణ ఇచ్చారు.

## కెజిబివిలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ )లో 2026–27 విద్య సంవత్సరానికి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధించేందుకు గెస్ట్ మహిళ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పద్మ శుక్రవారం ఓ ప్రకటనలు ఓ ప్రకటనలో తెలిపారు.కేజీబీవీ అప్ గ్రేడేషన్ భాగంగా ఇంటర్మీడియట్ సిఇసి విభాగంలో కామర్స్ ,ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పపోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థిలు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ జాడియేషన్ (పీజీ) బిఎడ్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అనుభవం కలిగిన మహిళ అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు అసిస్టెంట్ జిరాక్స్ ప్రతులతో జూన్ 20 నుంచి 22వ తేదీ వరకు గొల్లపల్లి కేజీబీవీ విద్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## పల్స్ పోలియో, నులిపురుగుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### తహసీల్దార్ వరప్రసాద్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 28న జరిగే పల్స్ పోలియో, జూలై 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి డా. వనజ మాట్లాడుతూ మండలంలోని 0–5 ఏళ్ల లోపు 3,360 మంది చిన్నారులకు 28 పోలియో బూత్‌ల ద్వారా చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించి ఓ ఆర్ ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గణేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్, ఏపీఎం శంకర్, సూపర్వైజర్లు శోభారాణి,తులసి రమణ,తదితరులు పాల్గొన్నారు.

## అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు మైన్ సింగరేణి కార్మికులతో సమావేశం

### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలో సింగరేణి బాయి బాట కార్యక్రమంలో భాగంగా అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ గేట్ మీటింగ్ లో పాల్గొన్న టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ, వేజ్ బోర్డు మెంబర్ రియాజ్ అహ్మద్.గేటు మీటింగ్ కు వచ్చిన కవితను లోపలకు వెళ్లకుండా పోలీసులు,సింగరేణి సెక్యూరిటీ గార్డ్స్ భారీ గేట్లు పెట్టి అడ్డుకున్నారు.గేట్లను తోసి వేసిన హెచ్ఎంఎస్ కార్మికులు, టిఆర్ఎస్ నాయకులు. కవిత కామెంట్స్,సింగరేణి ఆర్జీ 3 పరిధిలోని ఎఎల్ పి మైన్ లో గాలి వస్తలేదు మంచి మిషన్లు పెట్టి కార్మికులకు మంచి గాలి, నీళ్లు ఇవ్వండి.సింగరేణి కార్మికులకు మంచి పనిముట్లు లేవు పనిముట్లు ఇవ్వండి. గత నాలుగు రోజులుగాశ్రీధర్ బాబు పొలిటికల్‌గా మమ్ములను సింగరేణిలో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయంగా లబ్ధి పొందుదామని మంత్రి శ్రీధర్ బాబు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సింగరేణి కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలి పిలుపునిచ్చారు.

# ఘనంగా మహాలక్ష్మి షోడశ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవాలు, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహా సరస్వతి అమ్మ వార్లు కొలువుదీరిన దివ్యక్షేత్రం శ్రీ మాహాశక్తి దేవా లయం అఖండ భక్తి పారవశ్యంతో అధ్యాత్మిక శోభతో దేవాలయ షోడశ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. జగద్గురు శంకరాచార్య, హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైభవంగా పూజా కార్యక్రమాలు,అభిషేకాలు జరిగాయి. ఉదయం 4.30 గంటలకు జగద్గురువులు కరకమలాల ద్వారా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహా సరస్వతి అమ్మవార్లు, అనంత నాగేంద్ర స్వామి



వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వస్తి పుణ్యాహావాచనం, గణపతి పూజ, అఖండ దీపారాధన, సర్వతోభద్రమండల పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. తలలో ఉండే మెదడు సరిగా పని చేయాలన్నా నూనె రాయడం తప్పనిసరి అన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిని సన్మానించిన వ్యాపారులు

**ప్రజాపక్షం/జమ్మికుంట :** వ్యవసాయ మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు తీసుకున్న రుద్రాక్ష మల్లేశంకి అర్తీ వ్యాపారుల సంఘం శుక్రవారం ఘనంగా సన్మానించారు. మార్కెట్ కార్యదర్శిగా గతంలో పని చేసిన మల్లేశం మళ్లీ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని అర్తీ వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కార్యదర్శి మల్లేశం ముందుంటాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, గుమాస్తాలు హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కుల సంఘ భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/చొప్పదండి :** మండలంలోని ఆర్నకొండ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న రాజన్నల సంఘ భవనం, నాయి బ్రాహ్మణ సంఘ భవనాల నిర్మాణ పనులకు శుక్రవారం ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కొలిమికుంట గ్రామంలో జరుగుతున్న ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి పట్నాలకు హాజరై అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, గంగయ్య గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ


**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ గడ్డం రాజేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల విద్యావసరాల నిమిత్తం ఉపసర్పంచ్ జన్నె శ్రీవాణి ప్రవీణ్ పాఠశాల ఉపాధ్యాయునికి సౌండ్ బాక్స్ ను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 4వ వార్డ్ సభ్యుడు సిద్ద సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేందర్, గంగారాం, జన్నె అశోక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# గంజాయి సేవించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ రూరల్ మండలం లోని మొగ్దుంపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో కొంత మంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా పోలీసులను గమనించిన కొందరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా అతడి పేరు దుర్గం సాగర్ వృత్తి ఆటో డ్రైవర్ నివాసం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మత్తు పదార్థం తీసుకున్నట్లు అనుమానం కలుగగా పరీక్ష నిర్వహించగా గంజాయి తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. విచారణలో తను గత కొంతకాలంగా గంజాయి సేవించే అలవాటు ఉన్నట్లు గుర్తు తెలియని వ్యక్తి వద్ద న ఉంచి గంజాయి తీసుకొని సేవిస్తున్న సమయంలో పోలీసులు వస్తున్నారని గమనించి దానిని పడవేసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుబడినట్లు చెప్పారు. అనంతరం అతనని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి పంపగా వైద్య నివేదికలో కూడా గంజాయి తీసుకున్నట్లు నిర్ధారణ అయిందని సీఐ నిరంజన్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం, మత్తు పదార్థాలు, చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎక్మోతో ఊపిరితిత్తుల మార్పిడి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** తీవ్రమైన శ్వాస కోశ సమస్యలు, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధులతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులను కాపాడటంలో ఎక్మో (ఈసిఎంఓ) విధానం కీలకపాత్ర పోషిస్తుందని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వీ కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. కరీంనగర్ యశోద బ్రాంచ్‌లో నిర్వహించిన విలేకరుల



సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్న రోగులకు దాత అవయవం లభించే వరకు ఎక్మో ప్రాణాధారంగా పని చేస్తుందని వివరించారు. చివరి దశ ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డి) లేదా శ్వాసకోశ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు వెనో వీనస్ ఎక్మో ద్వారా శరీరం వెలుపలే రక్తానికి ఆక్సిజన్ అందించి కార్బన్ డయాక్సైడ్‌లను మళ్లీ శరీరంలోకి పంపుతారని తెలిపారు. ఈ విధానం ఊపిరితిత్తుల మార్పిడికి ముందు రోగుల ప్రాణాలను నిలబెట్టడంలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎక్మో సపోర్ట్‌పై ఉన్న రోగులకు డబుల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని వైద్యులు అనస్థీషియా నిపుణులు, ఐసీయు బృందం సమన్వయంతో మాత్రమే ఇది విజయవంతం అవుతుందని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక క్రిటికల్ కేర్, రిహాబిలిటేషన్ ద్వారా రోగులు తిరిగి సాధారణ జీవితం గడపగలరని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ వైద్యులు డా.జీవన్, జనరల్ మేనేజర్ సత్యా రెడ్డి, మార్కెటింగ్ విభాగం ప్రతినిధులు సుధీర్ రెడ్డి, హరీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహనలో బిజినెస్ రీసెర్చ్ మెథడాలజీ పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బిజినెస్ రీసెర్చ్ మెథడాలజీ పుస్తకాన్ని ఉప కులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ పరిపాలన భవనంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ పాల్గొనగా ఈ పుస్తక ప్రధాన రచయిత వాణిజ్య శాఖాధిపతి, ఓఎస్డీ టు విసి డా.డి.హరికాంత్, సహ రచయిత వాణిజ్య శాఖ పరిశోధక విద్యార్థి, గోదావరిఖని పీజీ కళాశాల అధ్యాపకులు అనిల్ బోనాల రచించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ పరిశోధన పద్ధతులపై విద్యార్థులు పరిశోధకులు అధ్యాపకులకు ఉపయోగపడేవిధంగా ఈ పుస్తకం రూపొందించడం అభినందనీయమని అన్నారు. పరిశోధన రంగంలో నాణ్యత పెంపొందించడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ మాట్లాడుతూ వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో అకాడమిక ప్రచురణలు రావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. రచయితలు భవిష్యత్తులో మరిన్ని పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా.కె.తిరుపతి, డా.బి.నరేశ డా.బి.పరశురాములు, డా.మనోజ్ కుమార్, కిషన్ తదితరులు పాల్గొని రచయితలను అభినందించారు.

# ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను అధునాతనంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారుల వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈలు ఊర్మిళ, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి**

**జిల్లా కేంద్రంలోని ప్రధాన పశువైద్యశాల సందర్శన**

గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చిత్రా మిత్రా.. పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న జిల్లా ప్రధాన పశువుల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా పశువులకు అందిస్తున్న సేవలు, వాక్సినేషన్, మందుల వివరాలు తెలుసుకున్నారు. గదులు కలియ తిరుగుతూ ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు, ఎక్స్ రే గది , మందుల గది పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు.

**శిథిల భవనం తొలగించండి**

ఆస్పత్రి ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి.. తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పాత భవనం స్థానంలో ఫౌంటెయిన్, పార్కింగ్ ప్లేస్, జంతువుల శవపరీక్ష ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు ఆదేశాలమేరకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పోరేటర్ అర్ష మల్లేశం, కార్పోరేటర్లు గుమ్మడి రాజ్‌కుమార్, పడాల శ్రీజ అజయ్, నందిని ఉదయ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరై కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గాంధీ కుటుంబం త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. దేశం కోసం మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ యువత, రైతులు, మహిళలు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల కాశెట్టి శ్రీనివాస్ గండి రాజేశ్వర్, సరిల్ల రతన్ రాజు, గండి శ్యాం,వేల్పుల వెంకటేశ్, పత్తెం లక్ష్మీ నారాయణ, రాజేశ్, వెలిచాల ప్రజా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో

**ప్రజాపక్షం/మానకొండూర్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మానకొండూర్ మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. ఈ వేడుకలలో మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మద్దికుంట సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్ నాయకులు తాళ్లపెల్లి సంపత్ గౌడ్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

## ముత్తారంలో

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రం లోని కాసర్లగడ్డ బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోర్లేని బుచ్చం రావు,దాసరి చంద్రమౌళి గౌడ్,కోటగిరి శ్రీనివాస్,గాదం శ్రీనివాస్,కోలా విజయ్ గౌడ్,నూనెటి కృష్ణ,చారి,శంకర్ తో పాటు కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారులతో చైర్మన్ మైలారపు లింబాద్రి సమీక్ష



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టెమోఫాస్, మలాథియన్ స్ప్రేలు నిర్వహించాలని సూచించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ప్రతి రోజు సాయంత్రం ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2026 సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు వార్డుల్లో చెత్త సేకరణ, నిర్వహణ విధానాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్,జిల్లా కమిటీ సభ్యుడు మణికంఠ, డాక్టర్ వాణి అంజిత్ రెడ్డి,కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,వార్డ్ ఆఫీసర్లు,ఆశా వర్కర్లు,అంగన్వాడీ సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగా మాతకు బోనాలు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని వాల్గొండ గ్రామంలో దేవాలయ కమిటీ చైర్మన్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పందిరి నాగరాజ్ ఆధ్వర్యంలో గంగా మాతకు శుక్రవారం బోనాలను సమర్పించారు. డప్పు చప్పులతో గొల్లెనతో ఊరేగింపుగా వెళ్లి గంగా మాత కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు గంగపుత్ర సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మెట్పల్లి నుండి ఖానాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు హుస్సేన్ నగర్ గ్రామంలో ద్విచక్ర వాహనం ఢీకొని వాహనదారునికి తీవ్ర గాయాలయ్యా. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం షేక్ ఖాసీం అనే యువకుడు పని నిమిత్తం ద్విచక్ర వాహనం తీసుకుని ఇంట్లో నుండి బయలుదేరిన కొద్ది నిమిషాల్లోనే ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్నాయని,ఈ ప్రమాదంలో షేక్ ఖాసింకు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా ఈ ప్రమాదానికి కావాల్సిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో, సర్పంచ్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎంపీహెచ్ఎస్ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో చిప్ప గణేష్ స్థానిక సర్పంచ్ బద్దం గోపి లు సందర్శించారు.అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎంపీడీవో, సర్పంచ్ పాల్గొని వి ద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు.అలాగే పాఠశాలలోని పారిశుద్ధ్య నిర్వహణ పనులను తనిఖీ చేసి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, ప్రధానోపాధ్యాయు లు కృష్ణ ప్రదీప్, ఏపీఎం శంకర్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజా పక్షం/ వేములవాడ:** తెలంగాణ మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభల కరపత్రం శుక్రవారం ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, ఎన్ ఎం ఆర్, ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి లో కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, వయసు మీరిన అనారోగ్యానికి గురైన కార్మికునికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్మిక సంఘం నాయకులు కల్లేపల్లి నర్సయ్య, సగ్గు శ్రీకాంత్, దుర్గయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహితకు అందరం భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కిరాణా షాపుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి, భావితరాల భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణంలో వ్యాపారవేత్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ నిల్వలను పూర్తిగా వినియోగించి తొలగించుకునేందుకు జూలై 31 వరకు గడువు ఇవ్వాలని వ్యాపారస్తులు కోరగా,మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో వ్యాపారులు, ప్రజలు మున్సిపాలిటీకి పూర్తి సహకారం అందించాలని కోరారు.నిర్దేశిత గడువు ముగిసిన అనంతరం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ స్పష్టం చేశారు.

## కుర్మపల్లి లో 'మన ఊరు—మన బడి'



### 15 మంది విద్యార్థుల నూతన ప్రవేశాలు

**ప్రజాపక్షం/రాయికల్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుర్మపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మ్యాకల మల్లేశం,ఉపసర్పంచ్ పుల్ల లత–మల్లేష్ తమ కుటుంబాలకు చెందిన ఇద్దరు పిల్లల చొప్పున ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు చేయించి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించారు. గ్రామంలోని ప్రతి బడిఈడు చిన్నారి విద్యను అభ్యసించేలా కృషి చేయాలని సర్పంచ్ మల్లేశం పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ఫలితంగా పాఠశాలలో నూతనంగా 15 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎలిగేటి రాజకిశోర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దయ్యాల కొమురవ్వ, ఉపాధ్యాయురాలు వొడ్నల ప్రియాంక, దయ్యాల మంజుల,పుల్ల మానస, పుల్ల తిరుమల,పుల్ల గంగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆసుపత్రిని సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న పేషంట్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జమ్మికుంట చుట్టుపక్కల 300 పైచిలుకు గ్రామాలకు కూడలిగా ఉన్న ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అందుకు తగిన మెరుగైన సౌకర్యాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు దశాబ్దాల కాలం నుంచి 30 పడకల ఆసుపత్రికే పరిమితం చేశారని రెండు నెలల క్రితం 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో అడుగు ముందడుగు వేయలేదన్నారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగినా ఎక్స్‌రే సౌకర్యం లేకపోవడం వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని దీంతో పేషంట్లపై ఆర్థికభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కానింగి సెంటర్ లేకపోవడం వల్ల స్థానిక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పేషంట్ల నుంచి అధిక మొత్తంలో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. డయాలసీస్ సెంటర్ ప్రకటించి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు ఏలాంటి చర్యలు లేవని దీంతో డయాలసీస్ పేషంట్లు హనుమకొండ, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ రోగులకు సరిపడా డాక్టర్స్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులతోపాటు స్టాఫ్ నర్స్, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది దూర ప్రాంతాల నుంచి కాకుండా జమ్మికుంట పట్టణంలోనే నివాసం ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమయపాలన పాటించని ఎల్‌డిసి, యూ డిసి, సీనియర్ అసిస్టేంట్ ఫార్మసిస్టులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పా ర్టీ మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమే శ్ యాదవ్, దండిగారి సతీశ్ కన్నం సదానందం, రావుల ఓదెలు, జీడీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాలలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు నందయ్య,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి మాట్లాడుతూ దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాల కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, రాజ్ కుమార్,ముఖేష్ కన్నా,తదితరులు ఉన్నారు.

## ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు గద్దరాశి భగవంతం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మ ణ్ మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న మాదిగలు అన్ని రంగాల్లో ప్రథమ స్థాయికి చేరుకొని, వర్గీకరణ ఫలాలను ప్రతి మాదిగ బిడ్డ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జులై 7న ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో జెండాలు ఎగువవేసి ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మల్లారం చంద్రయ్య, రాజయ్య పాల్గొన్నా రు.

## పానీపూరి దుకణాలకు ముందస్తు నోటీసులు...




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండల కేంద్రంలోని పానీపూరి బండ్ల యాజమానులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఇటీవల సిరిసిల్ల జిల్లాలో కెసీఆర్ కాలనీలో జరిగిన పానీపూరి కల్తీతో చాలా మంది చిన్నారులు అస్వస్థతకు గురికావడంతో జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఒక వారం రోజుల పాటు పానీపూరి బండ్లు తీయకూడదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు అందించిన వారిలో పంచాయతీ కార్యదర్శితో పాటు ఎల్లారెడ్డిపేట

# సమయపాలన పాటించని అధికారులు

## కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

**ప్రజాపక్షం/ నేరడిగొండః** నేరడిగొండ మండలంలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు సమయపాలన పాటించకపోవడంతో కార్యాలయాల్లో కుర్చీలు ఎప్పుడూ ఖాళీగా దర్శనమిస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యపు పనితీరు వల్ల పనులు కోసం లబ్ధిదారులు రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా వెలుగు సంస్థ ద్వారా మహిలా సంఘాల సభ్యులు పొందాల్సిన బ్యాంకు లింకేజీ లోన్ల మంజూరుకు మండల ఏపీఎం, సీసీల సంతకాలు అవసరం కాగా, సెర్ప్ అధికారులు ఉదయం సమయానకి రాకుండా మధ్యాహ్నం 12, ఒంటి గంటకు వస్తుండడంతో లోనన్లు రాక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మండల విద్యా శాఖ అధికారి పోస్టు ఇన్‌చార్జ్ వ్యవహారంగా మారి, సదరు


ఎం ఈ ఓ కార్యాలయం


సేర్ప్ కార్యాలయం

అధికారి వడూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తుండడం వల్ల విద్యాపరమైన పాలన సకాలంలో సాగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రెగ్యులర్ ఎంఈవోను నియమించి విద్యా వ్యవస్తను చక్కదిద్దాలని, మండల అధికారులు సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




**ప్రజాపక్షం/నిజాంసాగర్ః** విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని నిజాంసాగర్ మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ మోడల్ స్కూల్ అచ్చంపేట్‌లో ఇంటర్మీడియట్ బాలికల వసతీగృహంలో నూతనంగా ప్రవేశం పొందిన కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన బెడ్ షాట్‌లు, దుప్పట్లు, బ్లాంకెట్లను మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కార్తీకసంధ్యతో కలిసి పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని తమ తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిబాబా, ఉపాధ్యాయులు రవీంధర్, బ్రహ్మానందం, టీజీఎంఎస్ హాస్టల్ కేర్ సరిత పాల్గొన్నారు.

# మాగి గ్రామంలో బడిబాట



**ప్రజాపక్షం/నిజాంసాగర్ః** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు 11 మంది విద్యార్థులను బడిబాటలో భాగంగా పాఠశాలలో చేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయిని తెలిపారు. అనంతరం సీఆర్‌పీ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్థుతం విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో విద్య బోధన కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, పౌష్టికాహారంతో పాటు ప్రతీ విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకబృంధం భీంరావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/పిట్లంః** స్వర్ణకారులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని పిట్లం మండల స్వర్ణకారసంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పిట్లం మండల స్వర్ణకార సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. జీవో 272ను సవరణ చేసి దానిని పటిష్ఠంగా అమలుపరిచి స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీ నుండి కాపాడాలని, 50 యేండ్లు దాటిన స్వర్ణకార వృత్తిదారులకు, గీత, నేత కార్మికులకు 5000ల రూపాయల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారసంఘం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# భైంసా పట్టణంలోని పిప్రీ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

## కాలనీలోని ప్రతీ పౌరుడు...

## నేర నివారణలో భాగస్వామి కావాలి

**ప్రజాపక్షం / భైంసా :** భైంసా పట్టణంలోని జిల్లా ఎస్పీ జి.జానకీ షర్మిల ఆదేశాల మేరకు భైంసా సబ్ డివిజన్‌లోని పిప్రీ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 121 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడమైనది. ఈ సందర్భంగా భైంసా ఏ ఎస్పీ సాయి కిరణ్ ఐపిఎస్ మాట్లాడుతూ, సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, నిషేదిత మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణనిచ్చారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు.



అలాగే కాలనీ వారు ముందుకు వచ్చి నేను సైతంలో భాగంగా సిసిటీవి కెమేరాలను కాలనీలో ఇన్‌స్టాలేషన్ చేసుకోవాలని చెప్పడం జరిగింది. కాలనీ నేషనల్ హైవే కి ఆనుకొని ఉంది కావున కానీ లోపటికి బయటకు వచ్చే ముందు కొద్దిసేపు ఆగి హైవే పైకి వెల్లవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఎఎస్పీ సాయి కిరణ్ ఐపిఎస్‌తో పాటు భైంసా టౌన్ ఇన్స్‌పెక్టర్ సాయి కుమార్, ఎస్.ఐ. లు నవనీత్‌రెడ్డి, నాగభూషణం, దయాల్‌సింగ్ పోలీస్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

# కేజీబివీ స్కూల్లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కేజీబీవి విద్యార్థినుల అవసరాల కోసం 38.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే అనీల్ జాదవ్, ఎంపి గోడం నగేష్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను చక్కగా వినియోగించుకుంటూ మీ లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనీల్‌జాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా ఈ అదనపు గదుల నిర్మాణం



ఎంతగానో ఉపయోగపడుతుందని, నియోజకవర్గంలో విద్యా రంగానికి తాము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోల్సాలో స్కూల్ ప్రహారీ గోడ గేట్ ప్రారంభం

**ప్రజాపక్షం / తానూర్ :** మండలంలోని బోల్సా గ్రామంలో లక్షల నిధులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహారీ గోడ నిర్మాణం పూర్తయింది. శుక్రవారం నూతన గేట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుదర్శన్, ప్రధానోపాధ్యాలు దత్తాత్రి ఉపాధ్యాయులు వినోద్, శ్రేష్ట, వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల రక్షణకు ఈ గోడ ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# లోకేశ్వరంలో రాహుల్ గాధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలోని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కాపీలు, పెన్నులు, మరియు స్వీట్‌లు పంపిణీ చేసిన నాయకులు ఆత్మ చైర్మెన్ గన్ను నర్సారెడ్డి, సర్పంచ్ దర్వాడీ కపిల్, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీంరావు పటేల్, నియోజకవర్గ యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు అర్షప్రసాద్, ఎస్సీసెల్ అధ్యక్షుడు మోడం నరేష్, వెంకటేష్‌రావు, సుధాకర్ రావు, జాదవ్‌స్వామి,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# రవీంద్రనగర్‌లో 'నాషా ముక్త్ భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ః** పట్టణంలోని 36వ వార్డు రవీంద్రనగర్‌లో 'నాషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలనీవాసులకు, యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. వార్డు ఆఫీసర్, యూత్ మెంబర్లతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై కాలనీ యువతతో పాటు తల్లిదండ్రులకు కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సమక్షంలో ఫ్లెక్సీల ద్వారా వ్యసనాల నిర్మూలనపై వివరించారు. అనంతరం కలనీలో జింక్ కార్నర్ ఏర్పాటు చేసి స్థానికులకు జింక్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఉదయ్ కిరణ్ రెడ్డి, యూత్ మెంబర్ బండి సచిన్, అంగన్‌వాడీ టీచర్లు రాధ, నివేదిత, వినోద, రూప, ఆశా కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఐటిఐ, ఎటిసి కోర్సులకు 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ః** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల పి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో కోపా, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్లతో పాటు, ఏటీసీలో ఇండస్ట్రీయల్ ఆటోమేషన్, డిజైనింగ్ టెక్నీషియన్ వంటి అత్యాధునిక సాంకేతిక కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు తక్కువ కాలంలోనే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సాధించి మెరుగైన ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు ఉత్తమ అవకాశమన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలు పూర్తిగా మెరిట్ ఆధారంగానే ఉంటాయని, మరిన్ని వివరాలకు కార్యాలయ వేళల్లో 8500465816 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ నేరడిగొండః** కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ యువ నాయకుడు రాహుల్ గాంధీ దేశానికి దిక్సూచిగా, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ వసంత్, నాయకులు ఆగు రమేష్, రాథోడ్ వసంత్, నరేష్ రెడ్డి, రామ్ లక్ష్మణ్ గౌడ్, చంద్రశేఖర్, అంజయ్య, నారాయణ రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్‌గా ఎంపికైన కుప్టి యువకునికి సన్మానం

## బాధ కృష్ణ యువతకు ఆదర్శం

## హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

**ప్రజాపక్షం/ నేరడిగొండః** మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన రైతు బాధ వెంకటరమణ కుమారుడు బాధ కృష్ణ భారత సైన్యంలో ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కఠిన శ్రమ, పట్టుదలతో ఆర్మీ జవాన్‌గా ఎంపికైన బాధ కృష్ణ గ్రామీణ ప్రాంత యువతకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ దేశానికి, రాష్ట్రానికి, అలాగే కన్న గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఫౌండేషన్ ప్రతినిధులు ఎన్.టీ.రమణ, స్థానికి గ్రామస్తులు పాల్గొన్నారు.



## పెంచిన వేతనాల్ని వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు పెంచిన జీతాలను వెంటనే అమలు చేయాలని కోరుతై టియుసిఐ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్మూర్ డివిజన్ నాయకులు అరవింద్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పెంచిన జీతాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 50 మంది గ్రామపంచాయతీ కార్మికులతో ధర్నా నిర్వహించామన్నారు. అనంతరం ఎంపీడీఓ రంగుల సంతోష్‌కుమార్‌కు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ తరపున వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ 1వ వార్డులో ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను 1వ వార్డు కౌన్సిలర్ ఆరేపల్లి శ్రీజ నాగేంద్ర బాబు ప్రారంభించి మాట్లాడారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ ఒత్తిడి తగ్గి, గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో వస్తుందన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా వార్డు అభివృద్ధికి అవసరమైన మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జెజె నర్సయ్య, పర్స అనంతరావు, అంజుమ్ అలీ, సంగ్యానాయక్, నాయకులు సురేష్, శ్యారాజ్, సాయిబాబా, మనోజ్, దినేష్, మహేష నాయకులు, ప్రజు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** నియోజకవర్గంలో పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు మల్లె ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అనంతరావు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అధ్యాపకుల అడ్మిషన్ డ్రైవ్

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుకుమార్ చౌట్‌పల్లి గ్రామంలో పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇంటర్ అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేశారు. అదేవిధంగా చౌట్‌పల్లి గ్రామ సర్పంచ్ మహబూబ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అన్ని సబ్జెక్టులకు పూర్తి అధ్యాపక బృందం ఉన్నందు వల్ల మండలంలోని పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీసిలో భాగంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ తిరిగి స్వీకరణ, తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు తప్పనిసరిగా అన్ని అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. జిల్లాల వారిగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ నిర్వహణకు చేపట్టిన చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల వివరాలు కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ వీసి లో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను మొత్తం పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని వివరించారు. ఈ వీసిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, ఆర్డీ దేవీదాస్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వాతి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల రక్షణకు భరోసా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### నిర్మల్ జిల్లా ఎస్పి డా.జి.జానకీ షర్మిల




**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, అత్యాచారాలు, పోక్సో కేసుల బాధితులకు సమగ్ర సహాయం అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల తెలిపారు. బాధితులకు వైద్య, న్యాయ, మానసిక పునరావాస మరియు ఆర్థిక సహాయాన్ని ఒకే వేదికపై అందించే విధంగా ఈ కేంద్రాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు మెడికో లీగల్ పరీక్షలు, మానసిక కౌన్సిలింగ్, ఉచిత న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం మరియు పునరావాస సేవలు అందించబడతాయని ఎస్పీ వివరించారు. అలాగే పోక్సో అత్యాచార కేసుల బాధితులకు ప్రభుత్వం కల్పించే పరిహారం సత్వరమే అందేలా చూడడం కోసం జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంయుక్తంగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కేసుల దర్యాప్తులో దర్యాప్తు అధికారులు బాధితుల హక్కులను పరిరక్షిస్తూ, చట్ట ప్రకారం నిర్దేశించిన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. బాధితులకు పరిహారం, న్యాయ సహాయం, పునరావాసం వంటి సేవలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని అధికారులను సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ మరియు పునరావాస కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మెప్మా జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, బాలల సంక్షేమ కమిటీ జువెనైల్ జస్టిస్ బోర్డు మరియు సఖీ కేంద్రం వంటి వివిధ సంస్థలు చురుగ్గా భాగస్వాములవుతున్నాయని వెల్లడించారు. మహిళలు లేదా చిన్నారులపై జరిగే నేరాల విషయంలో బాధితులు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసులను భరోసా కేంద్రాలను లేదా సంబంధిత అధికారులను ధైర్యంగా సంప్రదించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిలతో పాటు డిఎస్పీ మురళి, డిసిఐఆర్బీ సిఐ కిరణ్, డిసిఐఆర్బీ ఎస్.ఐ సంజీవ్ భరోసా కేంద్ర ఇన్‌చార్జి ఎస్.ఐ.నర్సయ్య, డిడబ్ల్యూసి సభ్యులు శ్రీలత, అనీల్ కుమార్, సైమన్ చైల్డ్ లైన్ విభాగం కౌన్సిలర్, కోఆర్డినేటర్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో

### యశోధ హాస్పిటల్ ఆన్కాలజిస్ట్ డాక్టర్ సుమంత్‌కుమార్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నాయని సికింద్రాబాద్ యశోధ హాస్పిటల్ ఆన్కాలజిస్ట్ డాక్టర్ సుమంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని యశోధ మెడికల్ సెంటర్ లో విలేకరుల సమావేశంలో డాక్టర్ మల్లుపట్టు సుమంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం క్యాన్సర్ రోగాలకు అనేక రకాల క్యాన్సర్ చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందరికీ ఒకే విధమైన చికిత్స అవసరముండదని, ప్రతి వ్యక్తి పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయించడుతుందన్నారు. చికిత్స ముఖ్య ఉద్దేశ్యాలు క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించటం తగ్గించడం రోగి జీవిత నాన్యత మెరుగుపర్చడమన్నారు. చికిత్సతో వచ్చే సైడ్‌ఎఫెక్ట్స్ తగ్గించడం, అవసరమైన చికిత్సను తగ్గించకుండా సైడ్ ఎఫెక్ట్స్‌ను మినిమైజ్ చేయటం, ఆధునిక టెక్నాలజీ ప్రయోజనాలు అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేక డిస్కౌంట్ అందిస్తున్నామని, జిల్లాలోని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో శ్రీరాంసురేష్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/బాల్కొండ :** మాదకద్రవ్యాలు,డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని సిఐ జాన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు, ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంకు ఖాతా, ఎటిఎం పిన్ నెంబర్లు, ఓ టీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశ చూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెం. 1930 కి కాల్ చేయాలన్నారు. ఎంఈఓ బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్ని కుటుంబాన్ని భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల లో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం / భైంసా :** భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పేదల నాయకుడు ప్రజల మనిషి, ఎల్లప్పుడు పేద ప్రజల కోసం కొట్లాడే వ్యక్తి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశానుసారం మాజీ శాసనసభ్యులు జి విఠల్‌రెడ్డి ధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ వైస్ ప్రసిడెంట్ తూర్పాటి వెంకటేష్, ఏంసి వైస్ చైర్మెన్ ఎండి ఫారూక్ అహ్మద్, మాజీ జడ్పిటిసి ఉత్తం బాలేరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఖాదీర్, మాజీ ఎంపిటీసి పోశెట్టి మార్కెట్ డైరెక్టర్ భూమన్న మాజీ వైస్ చైర్మెన్ ఆసిఫ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిదాస్, సాయినాథ్ ధర్మేందర్ మౌలాఖాన్ పెద్ద నర్సయ్య, హన్మండ్లు, లచ్చారాం, ప్రసాద్ , సళ్ళ రాజన్న, నాగేష్, నాగప్ప, నాయకులు పాల్గొన్నారు.

**బోథ్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బోథ్ మండల కాంగ్రెస్ కుటుంబం ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, రైతులు, యువత, మహిళలుఅణగారిన వర్గాల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం చేస్తున్న పోరాటం దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన అవలంబిస్తున్న విధానాలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ గొర్ల రాజు యాదవ్, మాజీ ఏఎంసి చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మె మహేందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహదాస్ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ మాజీ ఎంపిటీసి చట్ల ఉమేష్, బోథ్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు భోజన్న, కాంగ్రెస్ యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద్ రెడ్డి ఉప సర్పంచ్ విజయ్ రాజు రెడి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద 50మందితో ధర్నా చేసి గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి టియుసిఐ జిల్లా నాయకులు రాజేశ్వర్ మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు పెంచుతామని ప్రకటించిన జీతాలను వెంటనే అమలు చేయాలని, ప్రతినెల 1న ఇవ్వాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించి పిఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, పెరుగుతున్న జనాభాకనుగుణంగా కార్మిక సంఖ్యను పెంచాలని, పని భారం తగ్గించాలని, మల్టీపర్పస్ 51 జీఓనురద్దు చేయాలని, కారోబార్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, చనిపోయిన కుటుంబానికి 10 లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టియుసిఐ నాయకులు అరవింద్, దేవన్న, నాగరాజు, రాజేందర్, కార్మికులు లక్ష్మీ రాజం, శ్రీను, రాజన్న, ఎర్రన్న, సురేష్, సునీత, సువార్త, కవిత, రఘు, లక్ష్మీ, భూదేవి, కమున, రాజవ్వ, ముత్తమ్మ పాల్గొన్నారు.

# కిడ్నీ చికిత్సలో హైటెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో అరుదైన రికార్డు : వైద్యుల వెల్లడి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** యశోధ హాస్పిటల్స్, హైటెక్ సిటీ యూనిటీ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన రికార్డును నెలకొల్పిందని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ వైద్యులు రాజశేఖర చక్రవర్తి, విజయ్ వర్మ బృందం వెల్లడించారు. యశోధలో ఆ బ్రాంచ్‌లో ఇప్పటివరకు 381 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా నిర్వహించి ఎంతో మంది బాధితులకు పునర్జన్మ ప్రసాదించమన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యనిపుణులు కిడ్నీ మార్పిడిలో తాము సాధించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్తగ్రూపులు కలవటం ప్రధానమైతే యశోధ హాస్పిటల్స్ బృందం బ్లడ్ గ్రూప్ వేరుగా ఉన్న రోగులకు కూడా విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వహించి ప్రస్తుతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేలా చేయటంలో విజయం సాధించామన్నారు. వయోభారంతో సంబంధం లేకుండా శస్త్రచికిత్స విషయంలో వయస్సు ఒక అడ్డంకి కాదని నిరూపించామన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులలో కూడా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి వారి ఆయుష్షును పెంచటంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. మా బృందం సాధించిన ఈ




381 ట్రాన్స్‌ప్లాంట్లు కేవలం సంఖ్య మాత్రమే కాదు, 381 కుటుంబాల్లో నిండిన వెలుగు, రక్తగ్రూపులు వేరైనా కిడ్నీ మార్పిడి సాధ్యమేనన్న అవగాహన ప్రజల్లో పెరగాలన్నారు. అత్యాధునిక సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్యబృందంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి చికిత్సలను అందిస్తూ దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌గా ఎదుగుతోందన్నారు. సమావేశంలో విజయ్ వర్మ, మేనేజర్ మధు పాల్గొన్నారు.

## ముందస్తు నిర్ధారణ శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/రాయికల్ :** ముందస్తు నిర్ధారణ పరీక్షలతోనే క్షయ నివారణ సాధ్యం అని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు. రాయికల్ బస్తి దావకాన సమీపం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజున డిజిటల్ మొబైల్ ఎక్స్ రే మిషన్ తో క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన ఎక్రే మిషన్ సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎక్రే తీసి వెంటనే క్షయ నిర్ధారణ చేపడుతున్నామన్నారు.. దగ్గు,జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే తేమడ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు...సుమారు 100 మందికి పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్మన్ రవీందర్ ,కౌన్సిలర్ పుర్రె శ్రీధర్ ,వైద్యాధికారి సతీష్ కుమార్ , బస్తి దావకాన వైద్యాధికారిడాక్టర్ సమీర్ , హెచ్ఈఓ సత్యనారాయణ,ఆరోగ్య పర్యవేక్షకులు మంకిడి శ్రీనివాస్,ఇల్లెందుల శ్రీనివాస్,ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఏఎన్ఎంలు సరిత,ఫాతిమా రేడియోగ్రాఫెర్స్ వికాస్,ఆశ కార్యకర్తలు,తదితరులున్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణం తెలంగాణ చౌక్ లో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడని. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని అన్నారు. రాజన్న ఆశీస్సులు రాహుల్ గాంధీ పై ఉండాలనీ స్వామి వారిని వేడుకున్నాము. దేశంలో అసమానతలు రూపుమాపాలని రాహుల్ గాంధీ సంకల్పించారు.అందులో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మణిపూర్ నుంచి ముంబై వరకు పాద యాత్ర చేశారు.పాదయాత్ర చేస్తున్న సమయంలో పేద ప్రజల స్థితిగతులను తెలుసుకొని వారికి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి పై రాజీ లేని పోరాటం చేస్తున్నారు.ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలి.రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే సంకల్పంగా ముందుకు వెళ్తున్నాం అని అన్నారు.

## సమష్టి కృషితో పాఠశాల అభివృద్ధి పథంలో సాగుతోంది

**ప్రజాపక్షం/బోధన్:** పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు, తల్లిదండులు ఇలా అందరి సమిష్టి కృషితో భవానిపేట్ పాఠశాల అభివృద్ధి పథంలో సాగుతోందని ఎంఈఓ నాగయ్య పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం భవానిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగయ్య మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో ప్రారంభమైన ఈ పాఠశాలలో 28మంది విద్యార్థులు విద్యనభ్యసించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 15మంది విద్యార్థులు కొత్తగా చేరడం సంతోషమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామ ప్రజలు అంధిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెంటకుర్ద




కాంప్లెక్స్ హెచ్ఎం రత్నాకర్, హెచ్ఎం కార్తిక్, సిఆర్‌పి విజయ్, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ లింగారం, ఉపాధ్యాయులు మౌనిక, కీర్తి, గ్రామ యువకులు భూమేష్, రాజు, కృష్ణ, గ్రామస్తులు లక్ష్మ య్య, గ్రామ పెద్దలు కిషోర్, ఇతర గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాలుగురకాల చెత్తపై అవగాహన



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో నాలుగు రకాల చెత్త విభజనపై గ్రామస్థులకు శుక్రవారం అధికారులు అవగాహన కల్పించారు. గ్రామస్థులందరు గ్రీన్ బుట్టలో తడిచెత్త, నీలిరంగు బుట్టలో పొడి వ్యర్థాలు, ఎరుపురంగు బుట్టలో శానిటరి చెత్త, నలుపురంగు బుట్టలో ప్రత్యేక/హానికర చెత్తలను ఇలా వేరువేరుగా చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ సిబ్బందికి ఇవ్వాలని డివిజనల్ పంచాయతీ అధికారి సురేష్‌బాబు అన్నారు. గ్రామస్థులందరు సహరించినప్పుడే చెత్త సేకరణ జరిగి గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఎం పెంటా గౌడ్, డాక్టర్ శ్రీహర్ష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పుష్పేంద్రసింగ్ షెకావత్, ఐకేపీ సీసీ సరిత, వీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వార్డుమెంబర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకులు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవాం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెంకట గౌడ్ మాట్లాడుతూ దేశంలో ప్రేమాభిమానాలు ఐక్యతను పెంపొందించేందుకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర చారిత్రాత్మకమని అన్నారు. పెదల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## నాటిన మొక్కలు సంరక్షించాలి

### ఎంఈఓ బుచ్యానాయక్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** ప్రతీఒక్కరి నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంఈఓ బుచ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బడి బాట సందర్భంగా హరితోత్సవంలో భాగంగా సర్పంచ్ ఆకుల కొమురయ్యతో కలసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు పెరిగే వరుకు వాటి సంరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోళ్ల భిక్షపతి, ప్రబాకర్‌రెడ్డి, హెచ్ఎం నర్సాగౌడ్, పాల్గొన్నారు.

## చదువుతోనే భవిష్యత్‌కు బంగారు బాట

### మండల విద్యాధికారి శంకర్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే భవిష్యత్‌కు బంగారు బాట అన్నారు. ప్రతి చిన్నారి బడిబాట పట్టి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను వివరించిన ఆయన తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమణి, గౌస్ ఖురేషీ, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ అశోక్, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## టియులో ప్రమీలకు పీహెచ్‌డీ ప్రదానం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** టియు అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసిన వై.ప్రమీలకు పీహెచ్‌డీ డిగ్రీ ప్రధానం చేసినట్లు విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం తెలిపారు. ఆమె (రాష్ట్రంలోని జిల్లాలో బాలకార్మికుల ఆర్థిక విశ్లేషణఒక అధ్యయనం) అనే అంశంపై ఆచార్య రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో అత్యుత్తమ పరిశోధన చేశానన్నారు. బుధవారం జరిగిన పీహెచ్‌డీ మౌఖిక పరీక్షకు కాకతీయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన ఆచార్య సురేష్‌లాల్ బాహ్య పరీక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగపు అధ్యాపకులు, ఇతర పరిశోధక విద్యార్థులు పాల్గొని ప్రమీల పరిశోధన ప్రజంటేషన్‌ను అభినందించారు.

## మోర్తాడ్ లో ఘనంగా జరిగిన రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో శుక్రవారం మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూత్పురం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీద్, నరేష్, ఎంసీ గంగాధర్, నాయకులు, పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయంలో ద్విచక్ర వాహన వేలం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ నెల 20వ తేదిన ఒక ద్విచక్ర వాహనాన్ని వేలం వేస్తున్నట్లు అబ్కారి శాఖ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గుండప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేది శనివారం రోజున ఉదయం 10.15 గంటలకు ఒక ద్విచక్ర వాహనం వేలం పాట ఉందన్నారు. ఆసక్తి గల వారు మద్య నిషేద, అబ్కారి స్టేషన్ మోర్తాడ్ నందు హాజరై 25శాతం ఈఎండి చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని ఆయన తెలిపారు.

## అమ్మ మాట—అంగన్వాడీ బాట

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో అమ్మ మాట—అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ శోభారాణి హాజరై మాట్లాడారు. మూడు సంవత్సరాల వయస్సు నుంచే పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని, ఆరోగ్యంతో పాటు నాణ్యమైన ప్రీస్కూల్ విద్య, ఎల్ కే జి నుండి యూకేజీ వరకు ఉచిత పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం, గర్భిణీలకు సీమంతం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఇందిరా, ప్రమీల, రమాదేవి, భాగ్య, మంజుల,రాజకళ, రాధ ఆశా కార్యకర్తలు,విద్యార్థులు,విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని రామ్‌సాగర్, బెజ్జంకి క్రాసింగ్,తోటపల్లి, లక్ష్మీ పూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన భాధిత కుటుంబాలను శుక్రవారం మాన కొండూర్ మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాకాల మహిపాల్ రెడ్డి,లింగాల లక్ష్మ ణ్, ఎల శేఖర్ బాబు, శ్రీనివాస్ రావు, కవ్వంపల్లి శ్రీనివాస్,వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై బిఎల్ఒలకు శిక్షణ

**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం, శుక్రవారం ధూళ్మిట్ట మండలకేంద్రంలోని రైతు వేదికలో తహశీల్దార్ శ్యామ్ ఆధ్వర్యలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ, క్షేత్ర స్థాయి విధులు, నిబంధనలపై బిఎల్‌వోలకు తహశీల్దార్ శ్యామ్ వివరించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నవీన్ కుమార్, జీపీఓలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్సా పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సా పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బైరి ఎల్లాగౌడ్ (45) గత పదిహేను రోజుల క్రితం జగదేవ్‌పూర్ సమీపంలోని కాటన్ మిల్లు వద్ద వడ్ల లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేనుక నుండి మోటార్ సైకిల్‌తో బలంగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతన్ని కొంపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్సా అందించారు. చికిత్సాపొందుతూ అతడు గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# రైతు భరోసా పేరుతో మరోసారి రైతులకు మోసం

### మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతల విమర్శ

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రైతు బరోసాతో పేరుతో మల్లి రైతులను మభ్య పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతుందని జగదేవ్‌పూర్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి విమర్శించారు. శుక్రవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ యాసంగికి రెండు ఎకరాలకే రైతు బరోసా వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం రైతు బరోసా ఒకే దపలో వేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని వారు ఆరోపించారు. యాసంగి రైతు బరోసాను పూర్తిగా వేసిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన గడువులోపు ఒకే దపలో వానకాలం బరోసాను రైతు ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ జేశారు. రెండున్నర ఎండ్ల రేవంత్‌రెడ్డి పాలనలో రెండు సీజన్ల రైతు బరోసాను ఎగగొట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని వారు ఎద్దవా జేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారన్నారు. సాగు నీరు,రసాయాన ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోల్లలో



ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. మిల్లర్లతో ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై రైతులు పండించిన ధాన్యం సేకరణలో నాణ్యత పేరుతో వారిని నట్టేట ముంచారని ఆరోపించారు. ప్రభుత్వం ఆనాలోచిత కారణాల వల్ల మండలంలో అధిక సంఖ్యలో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వ యాత్రంగాం పూర్తిగా విఫలం చెందిందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

## రైతులకు ఆన్‌లైన్ ద్వారా కాకుండా పాత పద్ధతి ద్వారా ఎరువులు, విత్తనాలను అందించాలని డిమాండ్

**ప్రజాపక్షం/ హుస్నాబాద్:** జూన్ 19. రైతులకు ఆన్‌లైన్ ద్వారా కాకుండ పాత పద్ధతి ద్వారా ఎరువులను విత్తనాలను ఆందించాలని డిమాండ్ చేస్తు బి ఆర్ ఎస్ పార్టీ ఆధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవా రం వ్యవసాయ ఆధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి రైతుల బతుకుల అధోగతి పాలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రైతులకు సకాలంలో విత్తనాలు అందితే ఎరువులు అందలేదు విత్తనాలు అందితే సకాలంలో ఎరువులు దొరక్క పోవడంతో పంటలకు ఎరువులు వేసే సమయాలకి వేయకపోవడంతో పంటలు దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడ రాక అనేక బాధలు పడ్డారని అన్నారు. ఎరువుల దుకాణల్లో నఖిలి విత్తనాల నియంతణ చేపట్టాలని ఆధికారులను కొరారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఆలాగే రైతులకు పెట్టుబడి కోసం బ్యాంకులు రుణాలను సకాలంలో ఆందించి ఆదుకోవాలని కొరారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం లో ఏ ఒక్క నాడు కూడ ఎరువులు, విత్తనాలు, కరంటు కొరతరాలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ఎరువుల కోసం గత 20 ఏళ్ల క్రితం ఉన్న విధానం చెప్పులు లైనుల్లో పెట్టుడు మళ్లి వచ్చిందని రైతులు మొత్తుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి ఎరువులు గాని విత్తనాలు గాని సకాలంలో ఆందించి ఆదుకోవాలని లేకుంటే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడు తామని హెచ్చరించారు. పార్టీ నాయకు లు శ్రీనివాస్, గాల్‌రెడ్డి, భూక్యరాజు, జానకిరాంరెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** సెల్స్‌పోర్స్ కంపెనీ ఉద్యోగుల ఆద్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణి చేశారు. భారత నగర్ డివిజన్ పరిదిలోని ఎల్ఐజి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కు సెల్స్‌పోర్స్ కంపెని ఉద్యోగుల ఆద్వర్యంలో విద్యార్థుల కు మాజీ కార్పోరేటర్ సందు ఆదర్స్ రెడ్డి చేతుల మీదుగా బ్యాగులు ,పుస్తకాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోటర్ సింధు ఆదర్స్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పాఠశాల సామగ్రిని అందజేశారు. ఈ సందర్బంగా ఆమె పాఠశాల అభివృద్దికి అవసరమైన మౌళిక వసతులకు మెరుగైన సెల్స్ పోర్స్ ప్రతినిధులను కోరారు. దీనికి స్పందించిన వారు. పాఠశాల అభివృద్ది పనులను వీలైనంత త్వరగా చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెల్స్ పోర్స్



కంపెనీ ఉద్యోగులు కార్డ్ లార్చినా ,అర్జున్ సాహా, పాండు రంగారావు, రాళ్లపల్లి ఎల్ఐజి కాలనీ అద్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శ్యామ్యూల్ జాన్, సత్యవతి సరిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థు విద్యాభివృద్దికి సహకరిస్తున్న సెల్స్ ఫోర్స్ కంపెనీ ఉద్యోగులను ఈ సందర్బంగా అభినందించారు.

## రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/వెల్దుర్తి:** రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులను పూర్తిగా దగా చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం నెల్లూరు పెద్దాపూర్ గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేశారు. నెల్లూరు గ్రామంలో 10 లక్షలతో నిర్మించిన స్కూల్ ప్రహరీ గోడను ఆమె ప్రారంభించారు. అనంతరం స్కూల్లో పిల్లలు మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. పెద్దాపూర్ గ్రామంలోని పిట్టల వాడలో ఐదు లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి అక్కడి పిట్టల వాడ ప్రజలతో మాట్లాడారు. వాళ్లకు ప్రభుత్వం తరపున ఇల్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బస్వాపూర్ గ్రామంలో జరుగుతున్న గ్రామదేవతల మొదటి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి పథకం ద్వార శెట్టిపల్లి రామయ్య పల్లి దామరంచ వెల్దుర్తి మహిళా సమైక్య భవనాలు మంజూరయ్యా



యని ఆమె తెలిపారు. మండలంలో వివిధ పాఠశాలలకు ప్రహరీ గోడలు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ధాన్యం కొ నుగోలు విపలమైందని కెసిఆర్ పాలనలో రైతులకు స్వర్ణ యుగం అని కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు చూస్తున్నారని, ఈ ప్రభుత్వం అన్ని రంగాల లోవిఫలమైందనిఆమె అన్నా రు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ విజయలక్ష్మి ఎంపీడీవో హరి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షు లు భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు శాకారం శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, వెల్దుర్తి ఉపసర్పంచ్ కమ్మరి శ్రవణ్ కుమార్, బిఆర్ఎస్ జిల్లా నాయకు లు కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిగుల్‌లో డ్రై డే



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలోని తిగుల్‌లో శుక్రవారం డ్రై డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు గ్రామంలో పర్యాటించి వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్థులను చైతన్యం చేశారు. అలాగే ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇండ్ల ముందు ప్లాస్టిక్ వస్తువులలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానకాలం ప్రారంభం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చొరవ చూపాలన్నారు. నీటి నిల్వలతో మలేరియా, డేంగ్యూ లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. మన ఊరు, మన ఆరోగ్యం, మన పరిశుభ్రత అనే లక్ష్యంతో ముందుకు పోవాలని కోరారు.

## “పేదల ఆత్మగౌరవానికి చిరునామా ఇందిరమ్మ ఇల్లు”

### జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్

**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట:** పేద ప్రజల సొంత ఇంటికలను సాకారం చేస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచే గొప్ప పథకం ఇందిరమ్మ ఇల్లు అని జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ ధూళ్మిట్ట మండలం జాలపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను మండల హౌసింగ్ ఏఈ సహానితో కలసి సర్పంచ్ కమలాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ, మొదటి విడుతలో గ్రామానికి 31 ఇళ్లు మంజూరు కావడానికి సహకరించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కొమ్ముూరి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసి గిరి కొండల్‌రెడ్డికి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 10 ఇళ్ల స్లాబ్ పనులు పూర్తియ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ ప్రజలు ఉన్నారు.



## సురభి ఆసుపత్రిలో ఫేస్‌మేకర్ ఇంఫ్లాంటేషన్ సక్సెస్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ పరిధిలోని సురభి మెడికల్ కళాశాల అనుబంధ సురభి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో భాగంగా శుక్రవారం ఫేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు సురభి ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీప్తిరావు తెలిపారు. చెర్యాలకు చెందిన బాలమ్మ(76) గుండెకు సంబంధించిన సమస్య రావడంతో రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చారని,గుండె నెమ్మదిగా కొట్టుకుండడాన్ని గ్రహించిన డాక్టర్లు ఫేస్‌మేకర్ చికిత్స అవసరం అని తెలిపారన్నారు. పేస్‌మేకర్ ఇంఫ్లాంటేషన్ అనేది గుండె కొట్టుకునే వేగం చాలా నెమ్మదిగా ఉన్నప్పుడు దానిని క్రమబద్దీకరించడానికి చాతి చర్మం కింద అమర్చిన చిన్న ఎలక్ట్రానిక్ పరికరం అని అన్నారు. గుండెలోని విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో బ్లాక్‌లు ఉన్నప్పుడు గుండె లయ తప్పుతుందని దానిని సరిచేయడాన్ని ఫేస్ మేకర్ ఇంపలాంటేషన్ అవసరమవుతదన్నారు. సర్జరీ జరిగిన తర్వాత రోగి క్షేమంగా ఉన్నారని అన్నారు. నిరుపేదలకు గ్రామీణ ప్రాంతంలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి చైర్మన్ హరీందర్ రావు ఆశయాలకు అనుగుణంగా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు,ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్దాప్య దశలో ఉన్న వ్యక్తికి అరుదైన చికిత్స నిర్వహించిన డాక్టర్లు బృంధాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ వంశీ,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.